కవితా కౌముది

# శుక్కురారం బుట్టినగాడు

షంషాద్

శుక్కురారం పొద్దు పొద్దుగాల బుట్టిన్నని
లచ్చిందేవి ఇంట్లకచ్చిందని
ఆకసంల సుక్కలన్ని రత్నాలై వొళ్ళెరాలిపడ్డట్టు
పిచ్చి తల్లి...
ఒకటే సంబురవడ్డదట మా అమ్మ!
బతకలేని బడిపంతులుగిరి జేస్కుంటనే
అప్పుల అప్పు జేసి పైసదువులు సదువుకుంటచ్చే బాపు
గదేందోగాని టంచన్ గ నేను బుట్టిన టయానికె
రెండు మూడేళ్ళకోసారి ఇచ్చే కరువు బత్తెం
ఒ మెట్టు పై పదవి అచ్చే !
ఇంగ బాపు మొఖం
పున్నం సెంద్రునిలెక్క యెలిగి పోయె
ఇంట్ల సందడి లొల్లి లొల్లిగ సెయ్యబట్టే
మరి నేను సుక్కురారం బుట్టినగాదు (మల్ల)!
నా తోడబుట్టిన ఇద్దర్ల
ముందల అన్న యెనకాల సెల్లె
ఐనా ఇంట్లందరు నన్నే పావురంగా సూడబడ్తిరి
ఆటపాటల్ల సిన్న దెబ్బతగిల్తె నాకు నొప్పే తెల్వకపాయె
బాధనంత బాపే బరించె!
ఆకలెయ్యక రెండుముద్దలు తక్కువ తిన్నా
అమ్మ ఉపాసం పండవట్టె నాకేమైందొనని
మరి నేను సుక్కురారం బుట్టిందొన్నిగాదు!
సెల్లెను కొట్టినా అన్ననేమన్నా
మల్ల తిట్లన్ని ఆల్లిద్దరికేనాయె
ఇంటికెవలన్న సుట్టాలొత్తె ముచ్చటంత నాదేనాయె
అద్రుట్టమంత నేనైనట్టు
మరి నేను సుక్కురారం బుట్టిందొన్నిగాదు!
గదేందోగాని పెండ్లి దినం సుత సుక్కురారమే అచ్చె
పూలు పండ్ల దినమే మా అమ్మ కండీషన్ కరారు జేసుకునె
సుక్కురారం రాతిరి పన్నెండు గంటలు దాటినాంకనె
గదిగూడ గురిగింజెత్తు బంగారమైన గడపల వెట్టి
నా బిడ్డను దాటించుకపోవాలని
మరి సుక్కురారం బుట్టిందిగాదు బిడ్డ
గా ఘడియ సుత రానే అచ్చె
సుక్కురారం బిడ్డ పల్లకి ఎక్కిందో పాడే ఎక్కిందో
ఏడ్పులైతె గట్లనె ఇనబడవట్టె
శనారం అడుగెట్టిన అత్తింట్ల
శనిలా దాపురించిన్నని అత్తింటివాల్లనవట్టె
ఆ ఇంట్లనె నాకు శనిబట్టిందని పుట్టింటివాల్లనవట్టె
ఇరవై యేండ్లు గడిసె
ఇప్పటికి వాల్లకు నేనొ నాకు వాల్లో
శని మాత్రం వదలట్లేదు మల్ల
నేను మాత్రం సుక్కురారం బిడ్డనె నా పుట్టినింట్ల
ఇప్పటికి ఎప్పటికి ★★★

## ఒక నులి వెచ్చని ఊహలో దగ్ధమౌతున్నప్పుడు.. శాంతివనం మంచికంటి

ఎందుకని చెప్పను ఈ మనసు నిండా పగుళ్ళు
ఏదో కాలం అలా దొర్లించుకుంటూ కదులుతుందిలే
మనమూ కొట్టుకు పోతున్నాములే అనుకుంటాం
కానీఅప్పుడప్పుడు అమితంగా స్పందిస్తాం
ఎందుకిలాగ అనుకుంటే
ముఖం నిండా ఎన్ని ఆశ్చర్యార్థకాలో!
ఒంటరిగా జీవించడమొక కల పగిలిన కరాళ రాత్రి గా
సాగిపోతున్న సమయంలో
ఏమో ఎక్కడో ఒక చోట
ఒక కుదుపుకు లోనైనప్పుడు
ఘనీభవించిన కన్నీళ్ళన్నిటినీ
ధారగా పోసి
మనసును ద్రవీభూతం చేస్తాం కదా
అప్పుడనిపిస్తుంది
అప్పటి దాకా ఎంత జీవితాన్ని పోగొట్టుకున్నామో అని

అందుకే ఎప్పుడూ బతికే వుండాలి
అప్పుడే నిద్రలో కూడా
పెదాలపై చిరునవ్వు విచ్చుకుంటుంది
పుచ్చపువ్వులా !!

***



# విరిగిన పద్యపాదం

బండారి రాజ్ కుమార్

నేను నేనులా లేని క్షణాల్ని
ఎన్ని వలలు విసిరి బంధించను?
నీటిలో జీవితమే శూన్యమని
ఒడ్డుకు ఎగిరిపడే చేపపిల్లకేం జవాబు చెప్పను?
అర్థంకాని భాష సంగీత లయలో కొట్టుకుపోతేనేం
ఉక్కిరిబిక్కిరి  చేసే రొదలో అక్షరాలు గిలగిలలాడితేనేం
అలలకు ఎవరు నేర్పి వుంటారో కదా
తీరాన్ని ముద్దాడి వెళ్లడమే దినచర్యలా...
కట్టుబానిసగా విశాలవిశ్వం నన్ను అంబారీపై ఊరేగిస్తుంటే
ఒక వెకిలి నవ్వేదో
గుండెలో శూలమై పొడిచినట్టనిపిస్తుంటే
వెనక్కి తిరిగి  చూడలేని
నిస్సహాయపు మెడలో బరువైన కీర్తిపూలదండలు ఎక్కిరిత్తాంటె
కళ్లముందు వేలాడే దృశ్యాల్ని
ఛిద్రంచేసి  కాళ్లకింద నున్నని రోడ్డేస్తున్నప్పుడు
అరే...కాలిలో ముల్లు దిగితే ఏడ్వాలి కదా
పసిపాపల నవ్వుల్లో  పొర్లాడి అంతో ఇంతో సంతోషాల్ని
పులుముకోవాలి కదా
ఏం బతుకురా నీది !
త్పూ...!
తుపుక్కున ఊంచినపుడు
తుడుచుకోవాలనిపించని తనాన్ని
మొఖాన్ని నురగనీటిలో ఎంతకడిగినా
మరకల్ని వదిలించుకోలేనపుడు
నీకేమైనా..అనిపించివుంటదా !
డిటర్జెంట్  మార్చమని పురమాయిస్తావెంట్రా ?
తలలూపడమొక్కటే తెలిసిన గొర్రెలకి
చాంతాడంత తోకల్ని అతికించేసి
ఉదయాల్ని తారుడబ్బాల్లో ముంచి
దండేనికి   వేలాడదీసి
చేబదులు  కారంపొడిని
రోకళ్లతో మట్రంగా గొంతులోకి కుక్కినప్పుడు
కన్నీటి చుక్కల్ని ఇవ్వలేని
వొట్టిపోయిన రెండు బావుల్ని చూసి
మేకుల్ని దిగ్గొట్టుకుని
కూరుకుపోయిన రెండు కాళ్ల స్తంభాల్ని చూసి
బొడ్రాయి  ఫక్కున నవ్వినపుడు
సలసల మరిగిన రక్తం సప్పుడు వినలేనితనం
చేతివేళ్లను ఒక్కటిచేసి  పిడికిలై
పిడిగుద్దులు విసరలేనితనం
నిర్వీర్యమైన వీర్యంతో నా దేశం
ఎంతమంది దేశభక్తుల్ని కంటుందో వేచిచూద్దాం !! ★★★



# ఉదయం - హృదయం శిష్ట్లా వి.యల్.యన్.శర్మ

ఉదయరాగంతో
హృదయంలో విచ్చు కుంటాయి.....ఆశలు
విచ్చుకుంటూ ఒద్దికగా
అచ్చమైన పరిమళాల్ని పంచిపెడతాయి.....ఊహలు
ప్రతి పూవూ ఉదయాన్నే వికసించి
పరిమళ విహారం చేయదు
కొన్ని మలి సంధ్యలోనూ వికసించి మురిపిస్తాయి
పూవంటే అంతా అందం
పూవంటే అంతా పరిమళం
రంగులేవైనా ఏ పూవూ దాని
హంగుల్ని కోల్పోదు
వాసన లేకున్నా అందాలతో
అలరిస్తాయి
అందం లేకున్నా పరిమళంతో
ఆదరిస్తాయి
అందానికి నిర్వచన మిస్తాయి
నీ లోని ఆశల్లాగా......
ఆహ్వానాలు పలుకుతాయి
నీ లోని ఊహల్లాగా......
ఎన్నెన్ని పూలో........
కొన్ని చెట్ల పూలై వర్షిస్తాయి
కొన్ని గడ్డి పూలై నిలబెడతాయి
కొన్ని ముళ్ళ పూలై కరుస్తాయి
కొన్ని పొదరింటి పూలై కౌగలించుకుంటాయి
కొన్ని లతల పూలై చుట్టుకుంటాయి
కొన్ని వెన్నెల పూలై పరుచుకుంటాయి
అందానికి ప్రతీకలు ఆశల పూలు
పరిమళానికి ప్రతీకలు ఊహల జాడలు
పూవూ...తావీ.....విడిచి వుండవు....
వాటికి మరో రూపం.....నీవు. ★★★

# నవతరానికి నా స్వప్నం

నాగరాజు రామస్వామి

నేనో స్వప్న సంచారిని,
నా దినచర్య కలల సేకరణ .
నేను
ప్రభాత కిరణ పరిమళాలలో
పగటి కలలను స్వప్నిస్తుంటాను,
మలి సంజ కెంజాయలలో
స్వప్నరాగాలను పులుము కుంటాను,
శిశిరాలు ఆకులు రాల్చినా
వసంతాలు పలాశలు పూచినా
వానకారు చిరుచినుకై కురిసినా
స్వప్నం సారూప్య మైనట్టు
నా సంతృప్త విభ్రాంతి !
నాలో
అకాశం పూల పందిరై
కలల చుక్కలను కోసుకొమ్మన్నట్టు
పుడమి ఓ స్వప్న వాటికై
నన్ను పూల విందుకై పిలుస్తున్నట్టు
సాగరం
కలల జలహాసమై నన్ను కవ్విస్తున్నట్టు
విశృంఖల స్వప్న విజృంభణ!

నేను కలల బేహారిని,
స్వప్న విహారాల యాత్రికున్ని;
స్వప్నాలే నా సకల సంపద !
నా కలలే నన్ను కవిని చేశాయి !

కలాం కనుమన్న కలలు నాటుకున్న
భారత భవితవ్య యువ భూములలో
కల్పతరువులు మొలకెత్తాలని
కలగంటున్నాను;
నా వంతు చిరు కానుకగా
సాకారంకాని నా స్వప్న శకలాన్ని
నవతరానికి బహూకరిస్తున్నాను.

★★★

# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

స్తబ్ధమై బ్రతుకెల్ల నిశ్శబ్దమయ్యె
కోయిలలు మరలినవి మేల్కొలుపలేక
కౌముదీకాంతి మసక చీకటిగ తోచె
ఎటులనో జీవితము గతియించుచుండె

గడచుచున్నది జీవిత కాలమెల్ల
ఎద నిదురపోయి తనువు శ్రమించుచుండె
నిను గనిన యంత మనసు మేల్కొనును నిజము
ప్రేమ మేల్కొని హృదయమ్ము విరియు నిజము

మనసు మేల్కొన మేదిని మారిపోవు
భువనమెల్లను బంగరు పూల నిండు
గగనమెల్లను నూతనకాంతులెగయు
వేయి వర్ణాలతో హరివిల్లు వెలుగు

వెలుగు హరివిల్లు మనయింట విడిది చేయు
పికశుకమ్ములు ముంగిట వేచి యుండు
చిన్న చిరునవ్వుతో వెతలన్ని తొలగు
ప్రతి యణువునందు పరితోషవార్ధి తోచు

పదము పాడగ తలచును హృదయమపుడు
తలపులో మయూరములు నర్తనము చేయు
అడుగు వేసిన నాట్యమే, నడక కాదు
ప్రకృతి యెల్లను చైతన్యవంతమగును



చిత్రం:కె.రామ్మోహన్

COMMENTS